# రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యం



వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 24 ఏప్రిల్, 2026 | పేజీలు :08


## సరస్వతి అంత్య పుష్కరాలకు గడువులోపల అన్ని ఏర్పాట్లు పూర్తి



కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భక్తుల సౌకర్యార్థం సరస్వతి అంత్య పుష్కరాల పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో అంత్య సరస్వతి పుష్కరాలు ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పుష్కరాల సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు చేపట్టిన పనుల పురోగతిని రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పీఆర్, విద్యుత్తు, ఆర్అండ్‌బి, ప్రణాళిక, రవాణా, పర్యాటక, అగ్నిమాపక అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా కాళేశ్వరంలో సరస్వతి ఘాట్ వద్ద జరుగుతున్న పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘాట్ సిద్ధం చేయడం, షట్టరింగ్ పనులు మరియు స్టాంప్డ్ కాంక్రీట్ వేయడం కొనసాగుతున్నాయని వేగం పెంచాలని సూచించారు. పేవర్ బ్లాక్స్ వేసే పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. భద్రత, పారిశుద్ధం, తాగునీరు, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. భక్తులు స్నానాలు ఆచరించేందుకు షవర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాజీపేట ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కాజీపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కాజీపేటలో హజ్ చైర్మన్ ఖుస్రు పాషా నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని, ముఖ్యంగా కాజీపేట ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.ఎన్నో ఏళ్లుగా కాజీపేట ప్రజలు పలు ప్రాథమిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని,తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను దశలవారీగా పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా దర్గా రైల్వే ట్రాక్ పక్కన ఉన్న దారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఒక ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు.కాజీపేట, సోమిడి, దర్గా ప్రాంతాలు ఇప్పటికీ గ్రామీణ వాతావరణంలోనే ఉన్నాయని, అందుకే ఆ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నామని వివరించారు.తనపై, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. గత పది సంవత్సరాలలో ఎన్ని నిధులు తెచ్చారో, తాను ఎమ్మెల్యేగా అయ్యాక ఎంత అభివృద్ధి నిధులు తీసుకొచ్చానో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రాంతం పేరు, మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.బిఆర్ఎస్, బిజెపి పార్టీలపై విమర్శలు గుప్పిస్తూ, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయలేక విమర్శలకే పరిమితమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో అవినీతి జరిగిందని, కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. కాజీపేటలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.శ్మశానవాటికకు రహదారి నిర్మాణం కోసం స్థానిక పెద్దలు, కూసుర్ పాషాతో కలిసి కేవలం 10 రోజుల్లో పనులు ప్రారంభించేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ.15 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గత పదేళ్లలో వచ్చిన నిధుల కంటే తమ ప్రభుత్వం రెట్టింపు నిధులు తీసుకువచ్చిందని స్పష్టం చేశారు.కాజీపేట దర్గా రోడ్డును హైవే ప్రమాణాలతో అభివృద్ధి చేశామని పేర్కొన్న ఎమ్మెల్యే, బస్టాండ్, డివిజన్ పేర్లతో గతంలో జరిగిన అవినీతిని ప్రజలు గుర్తించాలన్నారు. వరంగల్ జిల్లాలో ఆర్టీసీ వ్యవస్థను ప్రైవేటీకరణ చేసిన వారే ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని అన్నారు.ప్రజలు బిఆర్ఎస్, బిజెపి పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించిన ఎమ్మెల్యే, గతంలో జరిగిన అవినీతిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సొమ్మును దోచుకున్న ప్రతి పైసాను తిరిగి రాబట్టే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇప్పటి వరకు కాజీపేట దర్గా ప్రాంతాన్ని పట్టించుకోని వారు ఇప్పుడు విమర్శలు చేయడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని, ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి సాధిస్తామని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.

## భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ఆదర్శం



మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సగర వంశీయులైన భగీరథ మహర్షి, గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వీ అని కొనియాడారు. భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుని చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అందుకే గొప్ప ప్రయత్నాలను ‘భగీరథ ప్రయత్నం’ గా పిలుస్తారని వివరించారు. అనంతరం అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, డిపిఓ యాదయ్య, డిఆర్‌డిఓ శ్రీనివాస రావు, కలెక్టరేట్ ఏఓ యూనస్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గంగా కిషన్, సంఘ నాయకులు జిల్లా అధ్యక్షుడు సాయిలు, ఉప్పల సాగర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికే కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని రఘునాథపల్లి, తిమ్మంపేట గ్రామాలలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కడియం ప్రారంభించారు. రఘునాథపల్లి గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, 3 ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. తిమ్మంపేట గ్రామంలో రూ.27 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాలలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ పేద ప్రజల సొంత ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి సాకారం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే 6 గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు ఎడ్ల వెంకటయ్య, రాకేష్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, నాయకులు కరుణాకర్‌రావు, బేబి శ్రీనివాస్, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బూత్ ఇన్‌చార్జిల నియామకంపై కాంగ్రెస్ దృష్టి



**ప్రజాపక్షం/నెక్కొండ:**నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ కార్యాచరణ వేగం పెంచింది. ఈ సందర్భంగా నెక్కొండ, చెన్నా రావుపేట, ఖానాపురం మండలాల పరిధిలోని అన్ని బూత్‌లకు ఇన్‌చార్జిల నియామకానికి చర్యలు చేపట్టాలని పార్టీ నాయకత్వం సూచించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, గ్రామ స్థాయి అధ్యక్షులు, సర్పంచ్‌ల సమన్వయంతో ప్రతి బూత్‌కు ఒక ఇన్‌చార్జిని ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఎంపికైన ఇన్‌చార్జిల ఫోటో, ఓటర్ ఐడి వివరాలతో ఫారమ్ నింపించి సంతకాలు చేయించి సమర్పించాల్సిందిగా ఆదేశించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ సూచనలు జారీ చేశారు.

## బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ



**ప్రజాపక్షం/రాయపర్తి:**మండలంలోనిసన్నూరు గ్రామానికి చెందిన కోతి వెంకటేశ్వర్లు, వాంకుడోత్ తండాకు చెందిన మాజీ సర్పంచ్ పాండు నాయక్, బంధనపల్లి గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ నాయకులు వాలు నాయక్ తల్లి కేళి ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించగా వారి చిత్రపటాలకు మాజీ మంత్రి, పాలకుర్తి బిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షులు నరసింహనాయక్, మాజీ ఎంపిపి జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, పాల్గొన్నారు.

## గురిజాల ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు 15వేల విరాళం

**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట మండలంలోనిగురిజాల గ్రామంలో ఉన్నత విద్యను ప్రోత్సహించడం కోసం జీకే ఫౌండేషన్ (గడ్డం సాలమ్మ లింగమ్మ కిష్టయ్య) జ్ఞాపకార్థం అలువాల వీరేందర్ గా 2024లో స్థాపించిన జికె ఫౌండేషన్ ప్రతి సంవత్సరం ప్రైమరీ స్కూల్, హై స్కూల్, మెడికల్, ఇంజనీరింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతి సంవత్సరం 1,50,000 ప్రైజ్ మనీ ఇవ్వడం జరుగుతుంది. విద్యార్థులకు రూ. 15వేల విరాళం అందించారు.

## గురుకులాన్ని సందర్శించిన జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి



**ప్రజాపక్షం/రాయపర్తి:**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల్లో భాగంగా వెల్ఫేర్ వీక్ డే ఫోర్‌లో భాగంగా మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. విద్యార్థులు తీసుకునే ఆహారంలో ఐరన్ పోషకాలకు సంబంధించిన ఆరు పదార్థాల గురించి వివరించారు. వేసవి కాలంలో విద్యార్థులు బయట తిరగకుండా వారిని జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. గురుకులంకు సంబంధించిన మైండ్ స్పార్క్ ఆప్ ఉపయోగాలను గురించి వివరించారు. ప్రతి విద్యార్థి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ సరిత, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ధ్యేయం



**ప్రజాపక్షం/రాయపర్తి:**రైతులను రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వర్ధన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మొరిపిరాల, కిష్టాపురం, వాంకుడోత్ తండ, పోతిరెడ్డిపల్లి, జింకురాం తండ, ఎర్రకుంట తండ, గన్నారం, రాగన్నగూడెం గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. వరిధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2389, సాధారణ రకానికి రూ.2369 మద్దతు ధర ఉంటుందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలో పంటలు అమ్ముకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండలాధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, సర్పంచ్‌లు నాగరాజు, రంగారెడ్డి, రెడ్డి నాయక్, సునీత శ్రీనివాస్, బికోజి నాయక్, సమ్మయ్య, శోభ నారాయణ, మహేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, యాదగిరి, మల్లయ్య, ప్రభాకర్, నయిమ్, కోటేశ్వర్, సుదర్శన్‌రెడ్డి, యాకుబ్, ఎల్లారెడ్డి, యాకయ్య, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, సిసిలు, సిఏలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతును గోసపెడుతున్న పాలనపై బిఆర్‌ఎస్ ధ్వజం



**ప్రజాపక్షం/నెక్కొండ:**రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని వ్యవసాయ సమస్యలను గాలికొదిలేసి రాజకీయ ఆరోపణలకే పరిమితమైందని నర్సంపేట మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి మండిపడ్డారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ముందు బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన ఘాటుగా స్పందించారు. నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. మార్కెట్‌కు పంట తీసుకొచ్చిన రైతులను రోజులు గడిపిస్తూ సెలవువు పేరుతో కొనుగోళ్లను ఆలస్యం చేస్తున్నారని పాలకవర్గం అధికారుల తీరును తప్పుపట్టారు. వెంటనే కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచి, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు ప్రయివేట్ వ్యాపారులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడి, అది ప్రభుత్వానికే అపకీర్తి తెస్తుందని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వం అని చెప్పుకోవడం కాదు..రైతు కష్టాలను అర్థం చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రైతు బీమా, రైతు బంధు వంటి పథకాలు సక్రమంగా అమలు కాకపోవడంతో పాటు యూరియా కోసం రైతులు రాత్రింబవళ్లు క్యూలో నిలబడాల్సిన దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని రైతు వ్యతిరేక పాలనగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. ధర్నాలో మాజీ ఎంపిపి ఘటిక అజయ్‌కుమార్, నియోజకవర్గ నాయకులు, ప్రముఖ న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్, తాటిపల్లి శివకుమార్, సూరయ్య, నరేందర్ రెడ్డి, కారింగుల సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు బిజెపి పూర్తి మద్దతు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఆర్టిసి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని, ఆర్టిసి కార్మికులు చేస్తున్న సమ్మెకు బిజెపి పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిసి కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు. కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని, ప్రభుత్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని, పిఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ లో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీ మరిచి గద్దెనెక్కి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న కూడా వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం ఇది అతి ముఖ్యమైన డిమాండ్ అని, ఆర్టీసిని ప్రభుత్వ శాఖలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతన సవరణ (పిఆర్‌సి) అమలు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. యూనియన్ల పునరుద్ధరణ, కార్మిక సంఘాల (యూనియన్ ) గుర్తింపు ఎన్నికలను నిర్వహించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, సీనియర్ నాయకులు గడ్డం ఆంజనేయులు, కుంభం కోమల్ రెడ్డి, మల్యాల వినయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్ రెడ్డి, బిజెవైఎం నాయకులు జూలూరి మనీష్ గౌడ్, కొంకేస విగ్నేష్ గౌడ్, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్ర పాల్గొన్నారు.

## ఆర్‌టిసి డ్రైవర్ శంకర్ గౌడ్‌కు మెరుగైన చికిత్స అందించాలి

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**ఎంజిఎంలో ఆర్‌టిసి డ్రైవర్ శంకర్ గౌడ్ మెరుగైన చికిత్స అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి ఆదేశించారు. నర్సంపేట ఆర్‌టిసి డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో హుటాహుటిన ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని చికిత్స నిమిత్తం ఎంజిఎం ఆసుపత్రికి తరలిస్తున్న సందర్భంగా విషయాన్ని తెలుసుకున్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా ఎంజిఎం ఆసుపత్రికి ముందుగా చేసుకొని క్షతగాత్రునికి ఎమర్జెన్సీ వార్డు వద్ద నాణ్యమైన చికిత్స ఏర్పాట్లను అందించేందుకు వైద్యులను అప్రమత్తం చేశారు. ఎంజిఎం సూపరింటిండెంట్, అధికారులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

## పేదవాడి ఇంటి కళ నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం / నల్లబెల్లి :**రాష్ట్రంలోని పేద వాడి ఇంటి కళ నేరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మాలోతు మోహన్‌నాయక్ అన్నారు . గురువారం మండలంలోని మేడేపల్లి గ్రామ శివారు లక్ష్మి తండలో భూక్య అనుషకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ ప్రొసిడింగ్ పత్రాన్ని పంచాయితి కార్యదర్శి ఉల్లెంగుల అనిల్ అందజేశారు . అ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేసి అదుకుంటారని చెప్పారు . ఈ కార్యక్రమంలో మేడేపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు వంగల వెంకన్న ,ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు మంద చింటూ ,పార్టీ సినియార్ నాయకులు కాడబోయిన సదానందం ,మార్గం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు .

## ఐదవ రోజుకు చేరిన భద్రకాళి అమ్మవారి కళ్యాణ బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**భద్రకాళి దేవస్థానంలో శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ మహోత్సవాలు గురువారం నాటికి ఐదవ రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని సూర్య ప్రభ వాహనంపైన సాయంకాలం హంస వాహనంపైన ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమాలకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె అశోక్, వరంగల్ మహానగర అధ్యక్షులు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్, డాక్టర్ ఆలేటి కృష్ణ వర్ధిక, బుస్స మల్లేషం, ముదిరాజ్ నాయకులు పిట్టల సత్యనారాయణ, చొప్పరి సోమ్య, కార్పొరేటర్ చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్ అరుణ శ్రవణ్, బయ్య శోభన్, రాజమొగిలి, సంపత్, ఉమేష్, మధు, కుమారస్వామి, మాజీ జడ్పిటిసి పిట్టల శ్రీలత, మాధవి, స్వాతి, అనురాధ, పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



**పజాపక్షం / వేలేరు :** వేసవిని దృష్టిలో ఉంచుకొని వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ వైద్య సేవలు అందించడానికి బాధ్యతాయుతంగా సక్రమంగా విధులు నిర్వహించాలని హనుమకొండ జి ల్లా వైద్యఆరోగ్యశాఖఅధికారి డా,అప్పయ్య అన్నారు.గురువారం వేలేరు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని హనుమకొండ జిల్లా వైద్యరోగ్యశాఖ అధికారి డా,అప్పయ్య ఆకస్మిక తనిఖీ చేశారు.ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి మండుటెండలు బగబగమండుతున్నవేళ ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు ఆరోగ్య కిట్టు ఎల్లవేళలా అందుబాటులో ఉండేవిధంగా చూడాలి,హెచ్ పి వాక్సిన్,టార్గెట్ రీచ్ అయ్యారాలేదా,ఎన్ సి డి స్క్రీనింగ్ ఎలా ఉందనే విషయాలే కాకుండా వైద్య సిబ్బంది సకాలంలో సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా సక్రమంగా వైద్య సేవలు అందించాలని పిహెచ్‌సిలో గ్రూప్ తగాదాలు లేకుండా మండలప్రజలకు వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందికి పలుసూచనలు చేశారు.కార్యక్రమంలో డా,నవీన్ కుమార్,హెచ్ఇఒ వెంకటేశంర్లు,హెచ్‌వి ప్రభావతి,స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ అనిత,ఫార్మసిస్టు విజయ తదితరులు ఉన్నారు.

## రైతులకు బస్తాలను సకాలంలో అందించాలి

ప్రజాపక్షం/పాలకుర్తి: బస్తాల కొరతతో మొక్కజొన్న కొనుగోలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని శాతాపురం క్రాస్ రోడ్డులో ఉన్న మక్కల రాసులను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కాళేశ్వరం ప్రాజెక్టుపై అనేక అసత్య ప్రచారాలు చేసి ప్రజలను మోసం చేసిందని నిన్నటి తీర్పుతో వాళ్లు ఇప్పటికైనా మారి రైతులకు సాగునీరు ఇవ్వాలని ఆయన అన్నారు. వారం రోజులుగా రైతులు మక్కలు కాంటాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 11 లక్షల ఎకరాలలో మక్కజొన్న పండితే సగం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదని మండిపడ్డారు. అనంతరం మండలంలోని గూడూరు గ్రామంలో ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో దేవరుప్పుల మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య కుమారుని వివాహ వేడుకకు ఎర్రబెల్లి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన జిల్లా రెడ్ క్రాస్ పాలకవర్గం

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చాహత్ బాజపాయ్‌ని గురువారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, పాలకవర్గం కలిసి రెడ్ క్రాస్ కార్యక్రమాల గురించి వివరించి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ప్రారంభం, డైనింగ్ హాల్ భూమి పూజ, రెడ్ క్రాస్ డే కార్యక్రమాలకు పాల్గొనవలసిందిగా ఆహ్వానించినారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్. పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఇ. వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, పాల్గొన్నారు.

## మొబైల్ పోతే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి



ప్రజాపక్షం/వెంకటాపూర్ : పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఆన్లైన్ (సిఈఐఆర్ పోర్టల్ ) ద్వారా ఫిర్యాదు చేయగా ఫిర్యాదు నమోదు చేసుకున్న స్టేషన్ సిబ్బంది, వాటిని తిరిగి బాధితులకు అప్పగించడంలో భాగంగా ములుగు ఐ టీ కోర్ టీం సహాయంతో ఈ నెలలో మిస్సైన 25 మొబైల్ ఫోన్లను విజయవంతంగా గుర్తించి, వాటిని గురువారం రోజు బాధితులకు ఎస్ పి చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఐటి కోర్ టీమ్ ను అభినందించారు. వారి కృషి వల్ల తక్కువ సమయంలోనే మొబైల్ ఫోన్లు తిరిగి సాధించగలిగామని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందికి మిస్సింగ్ మొబైల్స్ రికవరీపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రజలు తమ వ్యక్తిగత వస్తువుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలని, మొబైల్ ఫోన్లు కోల్పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేసుకోని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రజాపక్షం/హనుమకొండ : గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల వారోత్సవాల సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణీలకు సామూహిక సీమంతం కార్యక్రమం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భధారణ ప్రారంభం నుండి పిల్లలకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లి ఆరోగ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కాలంలో గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. సరైన ఆహారం తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు చిన్న వయస్సులోనే గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించగా, గర్భిణీలకు సీమంతం నిర్వహించి అవసరమైన వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జీసీడీఓ సునీత, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ మహేందర్ కుమార్, డీపీఎం డాక్టర్ భాను ప్రకాష్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రుబీనా, డెమో అశోక్ రెడ్డి, మెప్మా డీఎంసీ రజిత రాణి, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, గర్భిణీలు, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

## దివి నుంచి భువికి గంగా జలాన్ని తీసుకొచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి

ప్రజాపక్షం/హనుమకొండ : లోక కల్యాణం కోసం దివి నుంచి భువికి పవిత్ర గంగాజలాన్ని తీసుకువచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తదితరులు పాల్గొని భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ అధికారికంగా నిర్వహిస్తున్నందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహా స్వామి, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు నలుబోల సతీష్, సగర సంక్షేమ అధ్యక్షుడు సీతా కమలాకర్ రావు, నెక్కొండ కిషన్, రాష్ట్ర కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి, రాష్ట్ర సగర మహిళా అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, తాడిశెట్టి విద్యాసాగర్, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభివృద్ధికి సమాజంతో సమన్వయం అవసరం

### వరంగల్ డిఇఒ రంగయ్య నాయుడు

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : ఆటోనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గిర్మాజీపేటలో ఈ విద్యా సంవత్సరపు చివరి పని దినం సందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపాల్ అధ్యక్షతన పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పిటిఎం) ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో బోధన చేయాలని, ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై దృష్టి పెట్టి పాఠశాలతో కలిసి పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం ఏఎంఒ సృజన్ తేజ మాట్లాడుతూ ఆధునిక బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీఎంఒ డిసిట కట్ల శ్రీనివాస్ ఆరోగ్యంపై అవగాహనతో పాటు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు ప్రతి విద్యార్థి ఫోటోతో రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. భూపాల్ గారు,బస్వ రాజుకుమార్ కార్పొరేటర్,మాజీ కార్పొరేటర్ ఎలుగం సత్యనారాయణ, చిప్ప వెంకటేశ్వర్లు కో ఆప్షన్ మెంబర్,పాఠశాల ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి,డాక్టర్ ఏ. సదయ్య,ఎండి. అఫ్సర్,భాస్కర్,జె.రాజు రమాదేవి,శకుంతల,అరుణ్ ,తబస్సుమ్ తదితరులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 27న బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

### కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిది

### మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి



ప్రజాపక్షం/భూపాలపల్లి :ఈనెల 27న జరిగే బి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కటకం జనార్ధన్ అధ్యక్షతన బిఆర్ ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు, రైతు బంధు వంటి పథకాల ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చారని గుర్తు చేశారు. ఇప్పుడున్న కాంగ్రెస్ సర్కార్ రైతాంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పైన అనేక ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు చెంపపెట్టు లాగా మారిందన్నారు. అబద్ధం తొందరగా ప్రచారం అయినా కూడా నిజం నిలకడ మీద తెలుస్తుందని అనడానికి కోర్టు తీర్పే నిదర్శనం అన్నారు. కేసీఆర్ ను మళ్ళీ ముఖ్యమంత్రి చేసే దాకా కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలన్నారు. 27న జరిగే పార్టీ ఆవిర్భావ వేడుకలకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గండ్ర హరీష్ రెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్, స్థానిక నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపికావ్యను కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్యను బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చకిలం ఉపేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలు, కోర్టు సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు న్యాయసేవలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం వంటి అంశాలపై చర్చించారు.బార్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చకిలం ఉపేందర్‌తో పాటు సభ్యులను ఎంపీ అభినందించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు లలిత కుమారి, సాంబశివరాజు తదితర కీలక సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రికి 7 పడకల డయాలసిస్ సెంటర్ మంజూరు

ప్రజాపక్షం/వర్ధన్నపేట :వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి 7 పడకలతో డయాలసిస్ సెంటర్ మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైద్య ఆరోగ్య శాఖల మంత్రివర్యులు దామోదర రాజ నర్సింహకు వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు సమీపంలోనే డయాలసిస్ సౌకర్యం అందుబాటులోకి రావడం ఎంతో ఉపయుక్తమని తెలిపారు.ఈ 7 పడకల డయాలసిస్ సెంటర్ ఏర్పాటు ద్వారా ఇప్పటివరకు దూర ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందాల్సిన అవసరం తగ్గి, రోగులకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని ఆయన వివరించారు. ఈ సదుపాయం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైద్య ఆరోగ్య శాఖల మంత్రివర్యులు దామోదర రాజనర్సింహకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులో వర్ధన్నపేట నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## మొక్కజొన్న,ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

ప్రజాపక్షం /నడికూడ: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో,మార్కాఫెడ్ సౌజన్యంతో మాదారం ఆధ్వర్యంలో,నార్లాపూర్‌లో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం,మార్కఫెడ్ ఆధ్వర్యంలో హాకా ఎఫ్ ఎస్ సి ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని,ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి లాభం పొందాలని సూచించారు.మొక్కజొన్నకు కనీస మద్దతు ధరగా రూ.2400 ఇవ్వనున్నట్లు,వరి ధాన్యానికి రూ.2389,2369లు మద్దతు ధర వెల్లడించారు.నడికూడ తహసీల్దార్ రాణి,సొసైటీ స్పెషల్ ఆఫీసర్ జ్యోతి,పిఎసిఎస్ సీఈవో రాజేందర్,ఏపిఎం నాగేశ్వర రావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్,నార్లాపూర్ గ్రామ సర్పంచ్ పెద్ద బోయిన రవీందర్ యాదవ్,కొత్తపెల్లి శ్రీనివాస్,ఈర్ల చిన్ని,నాయకులు పర్నం మల్లారెడ్డి పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రాంగణంలో అనధికారిక వాహనాల తొలగింపుపై హెచ్చరిక

ప్రజాపక్షం/జనగామ: జనగామ కలెక్టరేట్ ప్రాంగణంలో అనధికారికంగా పార్క్ చేసిన వాహనాను గుర్తించినట్లు కలెక్టరేట్ సూపరిండింట్ సీహెచ్ రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ భద్రత, క్రమశిక్షణ, నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈవాహనాలను ఈనెల 24 శుక్రవారం సాయంత్రంలోపు తప్పనిసరిగా తొలగించాల్సి ఉందని సూచించారు. అప్పటికి సూచించిన గడువులోపు వాహనాలు తొలగించని పక్షంలో 25వ తేదీ శనివారం నాడు క్రేన్లు, టోయింగ్ యంత్రాల సహాయంతో ఆ వాహనాలను తొలగించి, ఐడీఓసీ ప్రాంగణం వెలుపల ఉంచడం జరుగుతుందని హెచ్చరించారు. అందువల్ల వాహన యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వెంటనే స్పందించి తమ వాహనాలను తొలగించుకోవాలని కోరారు.

## విద్వేశాలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం చట్టరీత్య నేరం

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**సామాజిక మాధ్యమాల్లో విద్వేశాలను రెచ్చగొట్టే పోష్టులు పెట్టడం చట్టరీత్యా నేరమని సిఐ వెకటేశ్వర్లు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు.కుల,మత,వర్గాలపై ద్వేశాన్ని రెచ్చ గొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం చట్ట రీత్యా నేరమని ఎవరైనా విద్వేశాలను రెచ్చ గొట్టే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.విద్వేశాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సమాజంలో అశాంతి విద్వేశాలకు దారి తీస్తుందని తెలిపారు.పోష్టులు పెట్టేవారు చట్టపరమైన చర్యలకు గురికావల్సి వస్తుందని హెచ్చరించారు.సమాజంలో శాంతి భద్రతలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని చట్టాలను గౌరవించి సోషల్ మీడియాను సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు.

## ద్విచక్ర వాహనం ఢీ: బాలికకు గాయాలు

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:**మండలం ముప్పనపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం మధ్యాహ్నం వలస కూలీ గొత్తి కోయ పోయం లల్లి 12సం. తండ్రి. సక్కు రోడ్డు దాటుతుండగా వేగంగా వెళ్తున్న ద్వీచక్ర వాహనం ఢీ కొట్టగాలల్లి తలకు గాయాలు కాగా స్పృహ కోల్పోయి కింద పడిపోయింది. స్థానికుల కుటుంబ సభ్యులు సమాచారం మేరకు 108 వాహనం ఘటన స్థలానికి చేసుకుని గాయాలైన లల్లికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించడం జరిగింది. ఇఎంటి కళ్యాణ్, పైలట్ సతీష్ తదితరులున్నారు.

## మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మంగపేట:**ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు మండలంలోని ఓడగూడెం గ్రామం పేద కుటుంబానికి చెందిన జక్క కాంతమ్మ ఇటీవల మృతి చెందింది. గురువారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు దశదినకర్మకు హాజరై మృతురాలు కుటుంబానికి పరమర్శించి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మండల పార్టీ ఉపాధ్యక్షులు చిట్టీమల్ల సమ్మయ్య, మల్లూరు దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ నూతన కంటి ముకుందం బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కర్కపల్లి నరసింహారావు, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు బియ్యం శ్రీను, గ్రామ కమిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తెల్ల సురేష్, చిదరగడ్డ సాయి, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** ధాన్యం కొనుగోలు కేంద్రాల కు రైతులు తీసుకు వచ్చే ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాల ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ములుకనూరు సహకార గ్రా మీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా క లెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కేంద్రానికి ఎన్ని గ్రామాల నుండి ధాన్యం వస్తోంది, టోకెన్ వ్యవస్థ అమలు ఎలా జరుగుతోంది, ధాన్యం నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నా రు వంటి అంశాలను కలెక్టర్ అధికారులు, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న కాటన్ జిన్నింగ్ మిల్, ములుకనూరు రైస్ మిల్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత కార్యకలాపాలను సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని సందర్శించి, అక్కడి కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన పొందారు. సహకార సంఘం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ములుకనూరు సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, డీసీఎస్‌వో వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, ఏడీఏ ఆదిరెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఏవో పద్మ, ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి పదవి విరమణ సహజం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**సింగరేణి ఉన్నత పాఠశాల అభివృద్ధి కి నిభద్ధతతో పనిచేసిన ప్రధానోపాధ్యాయురాలు చంద్ర ఝాన్సీ రాణి అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్ర ఝాన్సీ రాణి పదవి విరమణ సన్మానం మహోత్సవంలో భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రధానోపాధ్యాయురాలు దంపతులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని, సింగరేణి పాఠశాల అభివృద్ధి కోసం ఆహర్నిశలు కృషి చేసిన వ్యక్తి ఝాన్సీ రాణి అని అన్నారు. 42 సంవత్సరాల తన ఉపాధ్యాయ వృత్తిలో సింగరేణి ప్రాంత పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేశారని గుర్తు చేశారు. పదవి విరమణ అనంతరం శేష జీవితం సుఖశాంతులతో కొనసాగాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సింగరేణి యాజమాన్యం సిఎస్ఆర్ నిధులను ఈ ప్రాంతం యొక్క అభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ కె.మారుతి రావు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధి కోసం ఝాన్సీ రాణి కృషి మరువలేనిదని పాఠశాల సమస్యల సాధనలో ఎంతో పట్టుదలను కనబరిచి విద్యార్థుల యొక్క ప్రగతికి ప్రతినిత్యం పాటుపడ్డారని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్, ఏఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, స్థానిక నాయకులు సింగరేణి అధికారులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉన్నత విద్యావంతుడైన మంత్రిపై విమర్శలు సరికాదు

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**రాష్ట్రాభివృద్ధిలో నిరంతర కృషి చేస్తున్న ఉన్నత విద్యావంతుడైన రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును విమర్శించే అర్హత బిఆర్ఎస్ నాయకుడు పుట్టమధుకు లేదని జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు,కాంగ్రేస్‌పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్,మాజీ జడ్పిటిసి చల్ల తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకుడు కట్కం అశోక్ అన్నారు.గురువారం మంలకేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రేస్ ప్రభుత్వం రాష్ట్రంలో వస్తే ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేయాలో,ఏ ఏ సామాజిక వర్గాలకు ఏం చేయాలనే ఆలోచన చేస్తూ తెలంగాణ ప్రజలకు కావలసిన అవసరాలను తీర్చాలనే ఆలోచనతో ప్రభుత్వంలో కీలక పాత్ర వహిస్తూ నిర్ణయాలు తీసుకునే రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును విమర్శించే అర్హత లేదని హెచ్చరించారు.రాష్ట్రానికి మెనిఫెస్టో కమిటీ చేర్మెన్‌గా నియమించారంటే అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వంలోనే మేధావి ఐన శ్రీధర్ బాబు,రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటే అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు.ప్రజలు ఎవరికి సన్యాసం కల్పించారో ఆలోచించాలని అన్నారు.మంథనిలో జరుగుతున్న అభివృద్ధిని అక్కడి ప్రజలను అడిగి తెలుసుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని తెలుసుకోవాలని,చూట్టూ ఉండే వారి తప్పుడు మాటలు విని రాష్ట్ర మంత్రిని విమర్శించి మెప్పు పొందాలనుకోవడం భ్రమ అన్నారు.పుట్ట మధు వ్యక్తిత్వం ఇష్టానుసారంగా మాట్లాడుతూ ఆరోపణలు చేయడం సరికాదని బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లప్పుల పాలు చేసారని అన్నారు.వివిధ సంస్థల నుండి అధిక వడ్డీలకు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు రుణపడి ఉంటాం

**ప్రజాపక్షం/మంగపేట:**తెలంగాణ ప్రభుత్వం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్ర అధికారికంగా ప్రకటించాడాన్ని ఆర్య వైశ్య తెలంగాణ రాష్ట్ర మహా సభ మంగపేట కమిటీ ప్రభుత్వానికి ధన్యధవాదములు తెలిపారు. ఈ సందర్బంగా ఆర్య వైశ్య తెలంగాణ రాష్ట్ర మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్ధంశెట్టి వైకుంఠం గురువారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని ఆర్యవైశ్య సమాజం హర్షాతిరేకంతో స్వాగతిస్తోంది. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించడం గొప్ప గౌరవప్రదమైన నిర్ణయం ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష



దశమి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించబడటం ద్వారా వాసవీ మాత మహిమ మరింత విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుంది. ఈ సంవత్సరం ఏప్రిల్ 26న రాష్ట్ర పండుగగా ఘనంగా జరగనున్న వేడుకలు సమాజానికి ఆనందాన్ని, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ఈ కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే ఈ జీఓ విడుదలకు కృషి చేసిన తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తు తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దణసరి అనసూయ సీతక్క కి కూడా మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధంశెట్టి, లక్ష్మణ్ రావు, జిల్లా కార్యదర్శి ఆనంతుల కృష్ణమూర్తి, మండల అధ్యక్షులు సిద్ధంశెట్టి కనకారావు, ఆనంతుల రవి, సింగిరి కొండ శ్రీనివాస్, మాదిశెట్టి రాజమౌళి, నేరేళ్ల బత్కయ్య, మాగం సద్గురు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి ఆదాయాన్ని పెంచాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** పారిశుద్ధ్య కార్యక్రమాలలో మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే అంశాలలో జనగామ మున్సిపాలిటీ ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణితో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మున్సిపల్ కార్యాలయంలోని ప్రతి విభాగాలకు సంబంధించిన అంశాలపై మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండాలన్నారు. మ్యాపింగ్ ప్రకారంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగాలన్నారు. పట్టణంలోని 30వార్డులకు గాను చెత్త సేకరణ వాహనాలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రాములు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ములుగు:**ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సేవాలాల్ స్టూడెంట్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ సంతోష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పూర్తి మద్దతు తెలిపి మాట్లాడుతూ ఆర్‌టిసి సమ్మె కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్సులు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాత్కాలికంగా పోలీస్ పర్యవేక్షణలో కొన్ని ప్రయివేట్ బస్సులు నడపడం కాకుండా, పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఆర్‌టిసి బస్సులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సాధారణ ప్రజలు కూడా ఈ సమ్మె వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌టిసి కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. అయితే విద్యార్థులు, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి, కార్మికుల న్యాయమైన డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, ఆర్‌టిసి కార్మికుల మధ్య చర్చలు జరిపి త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి.

## లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు):**వెంకటాపురంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రధానోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా చిరంజీవి, సైదులు, కాఫెడ్ ఎన్‌జిఓ డైరెక్టర్ బ్రదర్ లూర్దు రాజు, ఫాదర్, బ్రదర్ బాబులు పాల్గొని ప్రసంగించారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, విద్యార్థులకు మంచి విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయం

**ప్రజాపక్షం/గజ్వేల్:**ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం, అహింసామూర్తి శ్రీ వాసవి మాత అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షనీయమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త అన్నారు. గురువారం గజ్వేల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ శుక్లపక్ష దశమి రోజున రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వమే అధికారికంగా జయంతి వేడుకలు జరపాలని ప్రకటించడం పట్ల ఆర్య వైశ్యులు స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఆర్యవైశ్యుల్లోని నిరుపేదలను ప్రభుత్వం ఆదుకోవాలని, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం చేయాలని, తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# రైతుల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం:ఎమ్మెల్యే గండ్ర



ప్రజాపక్షం/గణపురం:గణపురం మండలంలోని జంగుపల్లి,బస్వరాజపల్లి, ధర్మారావు పేట,నగరంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సూచించారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు న్యాయమైన ధరలు లభిస్తాయని, మధ్యవర్తుల సమస్యలు లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరుగుతుందని తెలిపారు. అలాగే రైతులకు తక్షణ చెల్లింపులు, రవాణా సౌకర్యాలు వంటి అనేక ప్రయోజనాలు అందుతాయని వివరించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎటువంటి కోతలు లేకుండా సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రెండో రోజుకు చేరుకున్న ఆర్‌టిసి కార్మికుల సమ్మె

ప్రజాపక్షం/జనగామటౌన్: జిల్లా కేంద్రంలో ఆర్‌టిసి కార్మికుల సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. యాజమాన్యం ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లతో కొన్ని బస్సులను నడపడానికి ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో బస్టాండ్ ఆవరణలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటూ పోలీసుల వద్ద వినతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం జెఎసినాయకులతో చర్చలు జరిపి ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. తీవ్రమైన ఎండను లెక్కచేయకుండా మహిళా కండక్టర్లతో సహ డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు.

## ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాపక్షం / వేలేరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి అన్నారు.గురువారం వేలేరు మండలకేంద్రంలోని జిల్లాప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 6,7,8,9 తరగతులు చదువుతున్న క్లాస్ ఫస్టు విద్యార్థులకు బహుమతులు,సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాలలోని వివిధ తరగతులు విద్యార్థులు క్లాస్ ఫస్ట్ వచ్చిన వారికి బహుమతులతో పాటు సర్టిఫికెట్లు పంపిణీచేసి మాట్లాడారు,ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హులైన ఉపాధ్యాయులు ఉండడమేకాకుండా నాణ్యమైన విద్య ఉంటుందని అన్నారు,విద్యార్థులు విద్యార్థిదశలోనే ఇష్టంతో చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించి ఆదర్శవంతంగా జీవించాలని కోరారు,కార్యక్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిరి,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య,ఉపాధ్యాయినీఉపాధ్యాయులు ,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## కఠిన సేవా పథకం అందుకున్న గార్ల బయ్యారం సిఐ



ప్రజాపక్షం/–గార్ల ; నేర నియంత్రణ ప్రజల సమస్యల పరిష్కారం, శాంతి భద్రతల పరిరక్షణలో సిఐ లోగిడి రవిందర్ కృషి ప్రశంసనీయమని జిల్లా ఎస్‌పి డా.శబరీష్ అన్నారు. 2025 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కఠిన సేవా పథకానికి గార్ల బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ లోగిడి రవిందర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం నాడు మహబుబాబాద్ జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్ చేతుల మీదుగా మెమెంటోను అందుకున్నారు. సిఐ రవిందర్‌ను ఎస్పి శబరీష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధినిర్వహణలో క్రమశిక్షణ,నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని సిఐ రవిందర్‌ను ప్రశంసించారు. ఇకముందు కూడా ఇదే విధంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు సేవలు అందిస్తూ ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు.

## గూడూరు నియోజకవర్గ సాధనకు యువత శంఖారావం

ప్రజాపక్షం/గూడూరు; గూడూరు మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ఉర్పాటు చేయాలనే లక్ష్యంతో యువత మరింత చైతన్య వంతంగా ముందుకు వస్తోంది ఈనేపథ్యంలో గూడూరు అంగడి సెంటర్‌లో నిర్వహించిన గూడూరు నియోజకవర్గ యువజన జేపిసి సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. ఈసమావేశంలో ముఖ్యసలహాదారులు పేడకాసు కుమారస్వామి కాయితోజు దేవేంద్ర చారి పెసరి శివల సమక్షంలో నూతన కమిటి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.యువజన జేపిసి అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్ ప్రధాన కార్యదర్శి గా మహమ్మద్ రహీంపాష అదికార ప్రతినిధిగా భుక్య సురేష్ నాయక్ ఎన్నికయ్యారు.ప్రచార కార్యదర్శిగా పూడిశెట్టి సురేష్‌ను కార్యదర్శిలుగా చిదురు హరీష్ బానోత్ విజయ్‌కుమార్ అజ్మీర ఈశ్వర్ దార ప్రసాద్ బానోత్ అరవింద్ గుగులోత్ సుమన్ జాటోత్ శ్రీధర్‌ను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా జల్లి యాకయ్య భాషిపాక నవీన్ దోమ వెంకన్నలను ఎన్నుకోగా కమిటి సభ్యులుగా షేక్ షరీఫ్ దోమ రాము కొత్తూరు ప్రశాంత్ దోమ లక్ష్మణ్ సట్ల రాము లక్ష్మణ్ అభి సిద్దు అనిల్ తదితరులను నియమించారు. ఈసందర్భంగా అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. లక్ష్య సాధన కోసం భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువజన జేపిసి ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు.

## చైనా మాదిరిగా ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వం రద్దు చేయాలి

ప్రజాపక్షం/కమలాపూర్:చైనా మాదిరిగా ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వం రద్దు చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి తెలిపారు. తెలంగాణ ప్రొగెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కమలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో గూడూరు ప్రాథమిక పాఠశాలలో మండల ప్రధాన కార్యదర్శి లకుం భాస్కర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్‌లు మాట్లాడుతూ... రాష్ట్రంలోని బడి ఈడు పిల్లలందరికి ప్రభుత్వమే బాధ్యతగా, ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని, దానికి కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడమే ప్రధానమైన మార్గమని తెలిపారు. ఒక ఆవాస ప్రాంతంలో చదివే పిల్లలందరూ ఆ ఆవాస ప్రాంతంలోని బడిలోనే చదివే విధంగా నైబర్‌హుడ్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చైనా మాదిరిగా ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేసి, ప్రభుత్వమే స్వాధీనపరచుకోవాలని కోరారు. రెండవ పిఆర్‌సి నివేదికను తెప్పించుకొని అమలు చేయకపోవడం సరైంది కాదని, వెంటనే రెండవ పిఆర్‌సి నివేదికను బహిర్గతపరిచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ప్రత్యామ్నాయ విద్యా విధానం కొరకై ఈనెల 30న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బత్తిని శ్రీరామాంజనేయులు, టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : శ్రీరామోజు లక్ష్మి ప్రసన్న రోహిత్ దంపతుల ప్రథమ వివాహ వార్షికోత్సవ వేడుకలు హనుమకొండలోని వారి స్వగృహంలో అత్యంత వైభవంగా, ఆత్మీయుల సమక్షంలో జరిగాయి. ప్రస్తుతం యూకేలోని లండన్ సెంట్రల్ సిటీలో వైద్య వృత్తిలో రాణిస్తున్న డాక్టర్ లక్ష్మి ప్రసన్న, తన భర్త రోహిత్‌తో కలిసి మొదటి ఏడాది వైవాహిక బంధాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కుటుంబ సభ్యులు ఈ వేడుకను నిర్వహించారు.ఈ వేడుకకు ఓడీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం లక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు స్వయంగా కేక్ కట్ చేసి, నూతన దంపతులకు ఆశీస్సులు "అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లక్ష్మి ప్రసన్న రోహిత్ దంపతులు అన్యోన్యంగా ఉంటూ, నిండు నూరేళ్లూ సుఖసంతోషాలతో, ఆరోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.దూరతీరాల్లో ఉన్నప్పటికీ, ఈ యువ దంపతుల ఉన్నతిని కోరుతూ పలువురు ప్రముఖులు తమ సందేశాలను పంపారు. రాహుల్ ప్లేస్‌మెంట్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్), వెర్సజో గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గోల్కొండ సజ్జన్ కుమార్ మాట్లాడుతూ వృత్తిపరంగా లండన్‌లో రాణిస్తూనే, కుటుంబ మూలాలను గౌరవించడం అభినందనీయం". ఈ దంపతుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలి అని ఆకాంక్షించారు. (గాంధీ హాస్పిటల్ జనరల్ మెడిసిన్), రాహుల్ ప్లేస్" మెంట్స్ మేనేజింగ్ పార్ట్ నర్ గ్గోల్కొండ సాయి కుమార్" మాట్లాడుతూ వైద్య రంగంలో సేవలు అందిస్తున్న డాక్టర్ లక్ష్మి ప్రసన్న, రోహిత్ ల జోడీ ఆదర్శంగా నిలవాలి. వారి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల్లో మరిన్ని "ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.

**ఆత్మీయుల కోలాహలం**

హనుమకొండలోని నివాసం స్నేహితులు, బంధువుల రాకతో కళకళలాడింది. విదేశాల్లో ఉన్న దంపతులకు వీడియో కాల్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ కుటుంబ సభ్యులు పండుగ వాతావరణాన్ని తలపించారు. వారి ఉన్నత విద్యాభ్యాసం, విదేశాల్లో వారు సాధిస్తున్న విజయాల పట్ల ఆత్మీయులు గర్వం వ్యక్తం చేశారు.వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. శ్రీరామోజు కుటుంబం గోల్కొండ కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## కాలువ ఆక్రమణలపై ఇరిగేషన్ శాఖ దర్యాప్తు



ప్రజాపక్షం/గూడూరు:గూడూరు మండల కేంద్రనంలో రెవెన్యూ కాలువను అక్రమంగా ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్న ఘటనపై జిల్లా అధికారుల ఆదేశాలతో ఇరిగేషన్ శాఖ అధికారులు విచారణ ప్రారంభించారు.ఈ నేపథ్యంలో ఇరిగేషన్ ఏఏఈ గుగులోత్ శ్రీదేవి సర్వేయర్‌తో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాలువకు సంబంధించిన పాత రికార్డులను పరిశీలించి ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించినట్లు ఆమె తెలిపారు.సర్వే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుని ఆక్రమణలకు బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికారులకు నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు.కొత్తకుంట చెరువు నుంచి పారకం కాలువ ద్వారా కోడి చెరువుకు వెళ్లే సహజ నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాలువలు చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హెచ్చరించారు.ఈసర్వేలో గూడూరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ భరత్‌కుమార్ సర్వేయర్ రాజు ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం




ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మండుటెండల్లో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉదాత్త లక్ష్యంతో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 23న (గురువారం) రెడ్ క్రాస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు యన్. రవి ప్రారంభించారు.అదనపు కలెక్టర్ యన్. రవి మాట్లాడుతూ, "మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈ చలివేంద్రం సేవా దృక్పథానికి ప్రతిరూపం. తన పరిమితుల్లో నేనున్న సహాయం రెడ్ క్రాస్ కు అందించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని అన్నారు. తాగునీటి కొరత ఎదుర్కొనకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాం అని తెలిపారు.తర్వాత అదనపు కలెక్టర్ యన్. రవిని రెడ్ క్రాస్ సభ్యులు శాలువాతో సత్కరించి షీల్డ్ అందచేశారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ. వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు: పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ళ రమణ రెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో, బైక్‌ల దొంగలు అరెస్టు

ప్రజాపక్షం/కమలాపూర్:కష్టపడి పనిచేసుకుంటూ సమాజంలో గౌరవంగా జీవించాల్సిన వ్యక్తులు అక్రమ మార్గాలను ఎంచుకుకుటూ డబ్బు సంపాదించుకోని జల్సాలకు పాల్పడాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలు పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలలోకి వెళితే... కమలాపూర్ కేజిబివి సమీపంలో కమలాపూర్ ఎస్ఐ మధు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానస్పదంగా ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పోలీసుల అదుపులోకి తీసుకోని విచారించగా వరంగల్ జిల్లా రంగసాయిపేట గ్రామానికి చెందిన మద్దెల విక్రం, శంభునిపేట గ్రామానికి చెందిన మహమ్మద్ అజీమ్, వెంకటాపూర్ మండలం ఐనవోలు గ్రామానికి చెందిన వర్షం అనిల్ అనే ముగ్గురు దుండగులు కలిసి గత వారం రోజుల క్రితం కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో ఒక ఆటో దొంగతనం చేశారు. దీంతో పాటు సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామంలో ఒక బుల్లెట్ బండిని వీరి వద్ద ఉన్న మరో బైక్ ను పోలీసులు స్వాధీన పరుచుకోని కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు సిఐ తెలిపారు. చోరీలకు పాల్పడిన వ్యక్తులకు ఎన్నటికైనా శిక్షలు తప్పవని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ భాస్కర్, ఉదయ్, మోహన్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ చౌరస్తాలో కెసిఆర్, హరీష్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం

## నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీష్ రావుల చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కేసీఆర్ పైన పెట్టిన కేసులన్నీ నిరాధారమైనవని, ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ చేసిన కుయుక్తులని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి దుయ్యబట్టారు. ఈ కేసు విషయమై రాష్ట్ర హైకోర్టు పిసి ఘోష్ కమిషన్ను తప్పు పట్టిందని కాళేశ్వరం లో ఎలాంటి అవినీతి జరగలేదంటూ తీర్పు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు అని ఎమ్మెల్యే అన్నారు. ఆనాడే కేసీఆర్ ఒక మాట చెప్పారని తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఎడారిని



యస్యశ్యామలం చేయడం కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేయడం జరిగిందని అన్నారని తెలిపారు. కేవలం 96 వేల కోట్లతోని కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ సమయంలో కాళేశ్వరం నిర్మాణం చేసి రైతులకు నిరంధించడం తట్టుకోలేని కాంగ్రెస్ పార్టీ, కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని, ఈ విజయం కెసిఆర్ కు దక్కుతుందన్న ఈర్ష్యతోని నానా రకాల పేర్లు పెట్టి కెసిఆర్ ను హింసించారని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును మేము స్వాగతిస్తున్నామని, కాళేశ్వరంలో ఎలాంటి అవినీతి జరగలేదని హైకోర్టు తీర్పు ఇవ్వడం కేసీఆర్ లాంటి వ్యక్తికి ఈ తీర్పు స్వచ్ఛమైన మనిషిని గుర్తింపు ఇవ్వడమేనని ఆమె తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ చేసే కుయుక్తులు భవిష్యత్తులో చెల్లవని హైకోర్టు ఇచ్చిన తీర్పే కాంగ్రెస్ పార్టీకి చెంప పెట్టని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అన్నారు. ముత్యంల గుంత కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రం గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భోగ శేఖర్, సత్యం గౌడ్, హత్నూర మాజీ ఎంపీపీ నర్సింలు, వివిధ గ్రామాల సర్పంచులు, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి ఆశయాలు కొనసాగిద్దాం

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మహర్షి భగీరథ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని సాగర సంగం మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు సాయికుమార్ అన్నారు. మహర్షి జయంతి పురస్కరించుకొని సాగర సంగం నాయకులు రెడ్డిపల్లి, అప్పాజీ పల్లి, వెంకట్రావుపేట్ గ్రామాలలో సాగర సంగం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప్పరి సాయికుమార్ మాట్లాడుతూ భగీరథుని పట్టుదల అందరికీ స్ఫూర్తి దాయకమని, భగీరథుడు పట్టుదలగా తపస్సు చేసి దివి నుంచి భూమికి గంగను రప్పించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాగర సంగం నాయకులు అధ్యక్షులు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** ప్రగతి నివేదిక సంక్షేమ వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన కౌడిపల్లి లోని ఆశ్రమ పాఠశాలలో గురువారం రోజున ఉపాధ్యాయుల అలాగే తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదేవిధంగా తల్లిదండ్రులు విద్యార్థులకు చిన్న వయసులోనే ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉందన్నారు రోడ్డు నిబంధనలు అందరు పాటించాలని విద్యార్థులు అభివృద్ధి కోసం ఉపాధ్యాయులే కాకుండా పోషక మహాశయుల పాత్ర కీలకం అన్నారు మెనూ స్కూల్లో పెట్టడం జరిగిందని లోపాలు జరిగినా విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌డబ్ల్యూఓ జయరాజ్ మాట్లాడుతూ, పాఠశాల



యొక్క ప్రగతి నివేదికను సమావేశం ముందు చదివి వినిపించారు. మెనూ ప్రకారం ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్ట్ ని ఎంపీడీవో చేతుల మీదుగా అందించారు. తల్లిదండ్రులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యా గౌడ్, నరేందర్, గేమ్సింగ్ మంజుల, వినోద, రాజేశ్వరి, పిఈటి పొనిల్, ఏఎన్ఎం వెన్నెల విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది ఉన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలే లక్ష్యం

## విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**ప్రజాపక్షం/మెదక్:** రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. గురువారం మెదక్ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో విత్తన డీలర్లు, సమకార సంఘాలు, ఎఫ్‌పీఓలు, ఏఆర్ఎస్‌కే ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వానకాలం(ఖరీఫ్) సీజన్‌కు విత్తనాల కొరత లేదని, బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, కెఎన్ఎం 1638 వంటి సన్న రకాలతో పాటు కెఎన్ఎం 118, ఎమ్‌టీయు1010 వంటి దొడ్డు రకాల విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ప్రమాణ పరీక్షల అనంతరం మాత్రమే విత్తనాలను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో 3.20 లక్షల క్వింటాళ్ల విత్తనం అవసరమని వెల్లడించారు. అందులో కనీసం 40 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేయాలని సూచించారు. సహకార సంఘాలు అన్ని రకాల విత్తనాల పంపిణీలో చొరవ చూపాలని, లైసెన్స్ కలిగిన డీలర్లు ప్రభుత్వ సూచించిన విత్తనాలనే విక్రయించాలని ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫారంకు కంచ ఏర్పాటు చేయండి

**ప్రజాపక్షం/రేగోడు:** రేగోడు మండల కేంద్రం లోని తాటిపల్లి గ్రామంలో ఉరు చివరలో రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్పార్ కు చుట్టు పక్కల కంచ లేకుండా ఉన్నందువలన చిన్న పిల్లలు మూగజీవులకు ప్రమాదాలు జరిగే అవకాలు ఉన్నాయని అన్నారు సంవత్సరాలు గడుస్తున్న పట్టించుకునే నాధుడే లేరు అన్ని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తిత్వం చేశారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్పార్ కంచ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు

### కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా

# తాత్కాలిక ఏర్పాట్లు చేయడమా..?

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించమని సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా తాత్కాలిక ఏర్పాటు చేసి బస్సులో నడపడం సరి అయినది కాదని ఆర్టీసీ కార్మికులు నర్సింలు, సర్వన్, జేవి రావు అన్నారు. గురువారం మెదక్ డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులను పాపన్నపేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. పాపన్నపేట పోలీస్ స్టేషన్ నుండి మీడియాతో వారు చరవాణి లో మాట్లాడుతూ రెండవ రోజు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే అక్రమంగా అరెస్ట్ చేసి పాపన్నపేట పోలీస్ స్టేషన్ కు తరలించడం సబబు కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ తాత్కాలికమైన ఆలోచనను విరమించుకొని ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం వైపు మొగ్గు చూపాలన్నారు.. ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో పడిగె నరసింహులు జే.వి రావు ప్రభాకర్. సంధ్యారాణి. నాగమణి . కూచన్ పల్లి వెంకటేశం, శేఖర్ గౌడ్, బాలయ్య, భిక్షపతి, దేవేందర్ గౌడ్, బాబులాల్, ర్యాలమడుగు శ్రీనివాస్, మంబోజిపల్లి శ్రీనివాస్, కుర్తివాడ యాదగిరి తదితరులు ఉన్నారు.

# ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడికి పితృవియోగం..

## -పరామర్శించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బొడ్డు రవి తండ్రి బొడ్డు రాజలింగం గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారి నివాసానికి చేరుకొని భౌతికగాయానికి నివాళి అర్పించి బొడ్డురవిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ జడ్పీ కోఆప్షన్ మన్సూర్, ప్రెస్ క్లబ్ సభ్యులు, సర్పంచ్‌లు, పలు పార్టీల నాయకులు పరామర్శించారు.

# చిన్నపిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచండి

## గర్భిణీలు, చిన్నపిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలి

**ప్రజాపక్షం/గజ్వేల్:** చిన్నపిల్లలను మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాలని సిడిపిఓ సరిత, వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. పోషణ పక్వాడలో భాగంగా గురువారం వర్గల్ లో సర్పంచ్ దేవగనిక జయ భారతి అధ్యక్షతన ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించి రోగ నిరోధక శక్తిని పెంచాలని సూచించారు. అంతేకాకుండా గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలని కోరారు. తల్లి, శిశుపోషణ జాగ్రత్తగా ఉండాలని, జంక్ ఫుడ్ లకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. గర్భిణి )లు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాణి, తిరుపతమ్మ తదితరులు పాల్గొనగా, మహిళలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, చిన్నపిల్లలకు గ్రాడ్యుయేషన్ డే తదితర నిర్వహించారు.

# నగరం గ్రామంలో డిఎల్‌పిఒ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండలంలోని నగరం గ్రామంలో గురువారం రోజున డిఎల్పిఓ సురేష్ బాబు పల్లె ప్రగతి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, క్రిమటోరియం, పల్లెప్రకృతి వనం మరియు గ్రామ పంచాయతీ కార్యాలయం యందు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఎంపీఓ రజనీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, చల్మెడ పంచాయతీ కార్యదర్శి వెంకట నర్సింహరెడ్డి, గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల సురేష్ బాబు, ఉప సర్పంచ్ గుగ్లోత్ నాజం, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మే 5 ధర్నాను విజయవంతం చేయండి : ఎస్‌టియు

**ప్రజాపక్షం/మెదక్ :** ఎస్టియూ మెదక్ జిల్లా ద్వితీయ కార్యకర్త సమావేశం ఎస్టియు భవన్ మెదక్ లో జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్త సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ టీజీఈ జేఏసీ పిలుపుమేరకు రెండవ పిఆర్సి అమలు, 5 డీఏలను విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపు సిపిఎస్ రద్దు కొరకు మే 5న నిర్వహించే ఉద్యోగ ఉపాధ్యాయ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాటు చేసే తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ ఖచ్చితంగా ప్రతి కంప్లెక్స్ కు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, మెదక్ పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి రత్నాకర్, పాపన్నపేట అధ్యక్షులు ఎల్లం, ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్, కొల్చారం ఆధ్యక్షులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి 8 మంది : అరెస్ట్

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** కొంతమంది వ్యక్తులు రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై బుధవారం అర్ధరాత్రి పోలీసులు మెరుపు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలంలోని కళ్ళకల్ గ్రామ శివారులో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని కొంతమంది వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నారు. పక్కా సమాచారం మేరకు మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరం పై దాడి చేసి 8 మంది పేకాట రాయుళ్లని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ప్లేయింగ్ కార్డ్స్ తో పాటు 8 సెల్ ఫోన్లు, 62,490 రూపాయల నగదు, 5 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుభాష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులను తెలియజేయాలని కోరారు.

# దాడి చేసిన వారిపై కేసులు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామ శివారులోని ఫ్లెమింగ్ కంపెనీ సిబ్బందిని అకారణంగా దాడి చేసిన వారిపై కేసులు నమోదైనట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఫ్లెమింగ్ పరిశ్రమ లోనికి అక్రమంగా ప్రవేశించిన నవాబ్‌పేట గ్రామానికి చెందిన నల్ల హరిగౌడ్, నల్ల రవి గౌడ్, రాంపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, రాంపల్లి పాపిరెడ్డి, ఎండి ముస్తఫా, బోగి నరసింగరావు, సురకంటి మల్లారెడ్డి, పబ్బ సాయిరాం, ఏనుగు నరేందర్‌రెడ్డి, సురకట్టి దశరథరెడ్డి లు మరికొంత మంది అక్రమంగా ప్రవేశించి సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఎన్‌కే సింగ్, రాజేంద్ర ప్రసాద్‌లను బూతు మాటలు తిట్టి ఇట్టి స్థలం నుంచి ఖాళీ చేయాలని దాడి చేసి ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ఈ విషయమై కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాలలో వెబ్‌సైట్ ప్రారంభం

## రాష్ట్ర స్థాయిలో మొట్టమొదటి సారిగా పాఠశాల విద్యార్థులకు క్యూఆర్ కోడ్‌తో ఫలితాలు



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట** : తెలంగాణ రాష్ట్రంలోనే ఒక ప్రభుత్వ పాఠశాల తన సొంత వెబ్సైట్‌ను నిర్వహించుకోవడం ఇదే మొదటి సారి అని, అదేవిధంగా విద్యార్థుల మరియు వారి తల్లిదండ్రుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో ఫలితాలను విడుదల చేసి పాఠశాల ప్రత్యేకతను చాటుకున్నట్లు ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ధూల్మిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలసి పాఠశాల సొంత వెబ్‌సైట్‌ను ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కర్ణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల కృషితో కార్పొరేట్‌కు ధీటుగా రాష్ట్ర స్థాయిలో మొట్టమొదటి సారిగా, 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించి సమ్మేటివ్ అసెస్మెంట్ 2 (ఎస్ఎ2) పరీక్షలు ఫలితాలు అంతర్జాలంలో (ఆన్‌లైన్‌లో) తమ పాఠశాల సొంత వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు తెలిపారు. పరిక్షలకు ముందే క్యూఆర్ కోడ్ హాల్‌టికెట్ల విధానంతో వార్షిక పరీక్షల నిర్వాహణను, గత సంవత్సరం బార్‌కోడ్‌తో నిర్వహించిన ఇదే ప్రభుత్వ పాఠశాల, ఈ విద్యా సంవత్సరంలో ఇలా అనేక నూతన ఒరవడితో ముందుకు సాగుతున్నట్లు హెచ్ఎం కర్ణాకర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల అంటే ఇది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటుగా, గత కొన్ని సంవత్సరాలుగా పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలసి, జిల్లా విద్యాశాఖ ఆదేశాలకు మించి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తూ ఉత్తమ ఫలితాలను సాదిస్తోంది. ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డితో పాటుగా ఉపాధ్యాయుల అంకిత భావం విద్యార్థుల కృషితో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని ఎచ్ఎం తెలిపారు. ఈ పాఠశాల పరీక్షల విభాగం ఇన్‌చార్జి చిలుక వెంకటయ్య ఆధ్వర్యంలో పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు సుద్దాల రంజిత్ కుమార్ రూపొందించినట్లు ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో విద్యార్థి పేరు, తరగతితో పాటుగా, ప్రతి పరీక్షలో వచ్చిన ఫలితాలతో పూర్తి సమాచారంను ఒక్క క్యూఆర్ కోడ్ స్కానర్‌తో ప్రతి తల్లి తండ్రులు ఇంటి వద్ద నుండే సమాచారంను తెలుకోవచ్చని క్యూఆర్ కోడ్ తయారు చేసిన పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు సుద్దాల రంజిత్ కుమార్ తెలిపారు. ఇందులో అన్ని వివరాలు సంక్షుప్తంగా ఉన్నాయని వారు తెలిపారు. దీనిని మండల విద్యాధికారి మీనాంజనేయులుతో ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. గతనెల నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాల్లో ఇదే పాఠశాల జిల్లా స్థాయిలో చక్కని ప్రతిభను కనబరిచి, పలువురు విద్యార్థులు అర్హత సాధించినట్లు వారు తెలిపారు. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల జిల్లాకే ఆదర్శంగా నిలవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డితో పాటుగా ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు మండల విద్యావేత్తలు అభినందించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉపయోగపడే మరికొన్ని విద్యావిధానానికి నాంది పలుకుతామని ధీమా వ్యక్తం చేశారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్మినారాయణుడి బ్రహోత్సవాలు

**ప్రజాపక్షం/కొండాపూర్** : మండల పరిధిలోని మారేపల్లిలో గురువారం శ్రీ లక్ష్మి నారాయణుడి బ్రహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. గ్రామమంతా హరి నామ స్మరణతో మారు మోగుతుంది. ఈ ఉత్సవాలలో భాగంగా ఉత్సవ మూర్తులను తీసుకు వచ్చేందుకు ఉదయం 10 గంటలకు మారేపల్లి నుండి సంగారెడ్డిలోని వైకుంఠపురం వరకు రథంతో పాటు బస్సులో మహిళలు ,ద్విచక్రవాహనాల్లో పెద్ద ఎత్తున్న తరలి వెళ్లారు. వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకులు కందడై వరదా చార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై ఉత్సవ మూర్తులను ప్రతిష్టించారు. ఈ శోభాయాత్రలో భాగంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు సాంప్రదాయ దుస్తులను ధరించి కోలాటాలు వేయగా, పురుషులు,ఉత్సాహంగా చెక్క భజన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఈ శోభాయాత్ర సంగారెడ్డి నుండి వయా పెద్దపూర్, తొగర్‌పల్లి, కొండాపూర్ మీదుగా మారేపల్లికి చేరుకుంది. అత్యంత వైభవంగా జరుగుతున్న ఈ శోభాయాత్రలో భా గంగా తొగర్‌పల్లిలో ప్రతి ఇంటి నుంచి కలషాలన్ని తీసుకువచ్చి గ్రామస్థులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండల కేంద్రంలో నిర్వహించిన దుర్గమ్మకు బొడ్రాయి రెండవ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులందరు పోచమ్మకు బోనాలు సమర్పించారు. దుర్గమ్మ పండుగకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని సర్పంచ్ అర్జుల జ్యోతి మదుసూధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు కులదేతలకు బోనాలను సమర్పించాలని, శనివారం నాడు బొడ్రాయికి నీళ్లు పోయడం, అలాగే రాత్రి దుర్గమ్మకు బోనం సమర్పించడం, ఆదివారం నాడు వనభోజనాలు ఉంటాయని తెలిపారు.

# ఆర్టీసీ కార్మికులు సమ్మెలను శాంతియుతంగా చేయాలి

## బస్సులు, ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేస్తే సహించేది లేదు

### జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్



**ప్రజాపక్షం/సంగారెడ్డి** : రాష్ట్రంలో జరుగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో జిల్లాలో ఏలాంటి ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ తెలిపారు. సమ్మె పూర్తిగా శాంతియుతంగా వాతావరణంలోనే నిర్వహించుకోవాలని ,కార్మికులు తమ వినతులను సంబందిత ఉన్నతాధికారులకు తెలియజేయాలే కాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు అన్నారు. సమ్మె కారణంగా ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు , ఉద్యోగులు ,అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రాపిక్ ,రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చినా ఆర్టీసీ డ్రైవర్లు తిరిగి విధుల్లో చేరినా వారికి ఎటువంటి బెదిరింపులు లేకుండా పూర్తి భద్రత కల్పిస్తామని హామి ఇచ్చారు. ఆర్టీసీ బస్సులు నడపడానికి అర్హత కలిగిన డ్రైవర్లు ముందుకు రావాలని సూచించారు. ఆసక్తి ఉన్న డ్రైవర్లు జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739 సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ,ప్రైవేటు ఆస్తుల కు నష్టం కలిగించినా ,అదికారులపై దాడులకు పాల్పడినా అలాంటి వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ చట్టానికి లోబడి వ్యవహరించాలని సూచించారు. సోషల్ మీడియా లో తప్పుడు ప్రచారం వదంతులు వ్యాప్తి చేసే వారిపై కూ డా జిల్లా పోలీసు కార్యాలయం నుండి పర్యవేక్షణ కొనసాగుతొందని అట్టి వ్యక్తులపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమ్మెలో పాల్గొని కార్మికులు ,ప్రజలు పరస్పర గౌరవంతో వ్యవహరించి ఏలాంటి ఉద్రిక్తతలకు తావు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు శాంతి భద్రతలను కాపాడటంలో పోలీస్ శాఖకు సహకరించాలని ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపించిన వెంటనే సమీప పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

## వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం / హుస్నాబాద్** : హుస్నాబాద్ వ్యవసాయ మార్కెటలో కి వచ్చిన ధాన్యంను వెంట వెంటనే కొనుగోల్లు చేయుటకు వేగం పెంచి రైతులకు అకాల వర్షతో నష్టం లేకుండ ప్రభుత్వం యంత్రాంగం తగు చర్యలు తీసువాలని బిఆర్ ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెటల్లోని వరి, మక్కల ధాన్యం కొనుగోళ్ల పక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ ఎస్ పార్టీ ఆధికారప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించి పంటను అమ్ముకొవాడానికి మార్కెట్ తీసుకువస్తే ఆధికారులు మాత్రం కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ వచ్చి పంటను వెంట వెంటనే కొనుగోలు చేస్తే రైతులకు ఏలాంటి ఇబ్బందుల ఉండవని నేడు కురుస్తున్న ఆకాల వర్షలతో రైతులు తీవ్రమైన ఇబ్బందులుచపడవలసిన పరిస్థితి ఏర్పాడుతుందని అన్నారు. మిల్లర్ల నుండి అలాట్‌మెంట్ ఎప్పటి కప్పుడడు చేయించాలని కొరారు. వ్యవసాయ మార్కెటలో మక్కల కొనుగోలో ప్రారంబించి నెల రోజులు గడుస్తున్న నేటికి 20వేల క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. నియోజకవర్గ స్థాయితో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కొనుగోలు చేపట్టాలని కొరారు. ఈ కార్యాక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు పట్టణ ఆధ్యక్షులు అన్వర్, వంగ వెంకట్రాంరెడ్డి, ఏ ప్రభాకర్‌రెడ్డి, బండి రమణరెడ్డి, ఎం. వికాశ్ యాదవ్, బూర వెంకన్న, సదానందం, బొడ శ్రీనివాస్, గోపగాని అరవింద్‌గౌడు, లు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/బెజ్జంకిః** మండల పరిధిలోని లక్ష్మీపూర్, గూడెం గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సర్పంచ్‌లు ముక్కీస కవిత రత్నాకర్ రెడ్డి, గూడెల్లి శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా మాజీ ఎంపిపి ఒగ్గు దామోదర్ హజరై పాల్గొన్నారు.అంతే కాకుండా ముత్తన్నపేట, తిమ్మాయిపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక సర్పంచ్‌లతో కలిసి ఏఎంసి చైర్మెన్ పులి కృష్ణ ప్రారంభించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,రైతులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును కలిసిన మాద్రి వృథ్వీరాజ్

**ప్రజాపక్షం/సంగారెడ్డి** : జస్టిస్ పిసి గోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించడం అలాగే మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, హరీష్‌రావు కు న్యాయ విజయం లభించడం ఒక ముఖ్యమైన పరిణామం ఈ సందర్భంగా ఈ రోజు హరీష్ రావు ను కలిసి మాద్రి వృథ్వీరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వృథ్వీరాజ్ మాట్లాడుతూ ఘోష్ కమిషన్ విషయానికి వస్తే ఈ కమిషన్ కాంగ్రెస్ పార్టీకి సంబందించిన కమీషన్ అని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఈ ఇరకాటంలో పెట్టి ఇబ్బంది పెట్టడం పెట్టడానికి ఏర్పాటు చేసిన కమీషన్ తప్ప అటు వాళ్లకు ,ఇటు ప్రజలకు పనికి వచ్చే కాదు అని దీని మీద కాలయాపన చేసే బదులు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని మోద్రి వృథ్వీరాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆదర్శ్‌రెడ్డి, పటాన్చెరు మాజీ కార్పొరేటర్ కుమార్ యాదవ్, ఎండిఆర్ యువసేన సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/కొమురవెల్లిః** మండల పరిధిలోని రాంసాగర్ గ్రామంలో పెద్దమ్మ పెద్ది రాజుల కల్యాణ మహోత్సవాన్ని గురువారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.అనంతరం భక్తులకు అన్నాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్కెనపల్లి మల్లారెడ్డి,ప సర్పంచ్ మల్లారెడ్డి,వార్డు సభ్యులు,గ్రామస్తులు,ముదిరాజ్ బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## గూడెం మహిపాల్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే చింతాప్రభాకర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి** : హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని సంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అద్యక్షులు ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. భగవంతుని ఆశీస్సులతో త్వరగా కోలుకొని మళ్లీ ప్రజాసేవాలోకి రావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట డిసిఎంఎస్ శివవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేటర్ బాధ్యత సరికాదు

**ప్రజాపక్షం/పాపన్నపేటః** జన గణన డ్యూటీల విషయంలో సీనియర్ ఉపాధ్యాయులను పక్కనపెట్టి జూనియర్ ఉపాధ్యాయులకి ఎన్యూమరేటర్ డ్యూటీలు వేస్తూ మండల విద్యాధికారి ఏకపక్ష నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ సంఘాల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం వారి మీడియాతో మాట్లాడుతూ మండల విద్యాధికారి ఏ సమాచారమైన. ప్రధాన జాబి తాలైన. కేవలం ఒక్క ఉపాధ్యాయ సంఘానికి మాత్రమే సమాచారం ఇస్తున్నారన్నారు. పాపన్నపేట మండలంలో ఐదు ఉపాధ్యాయ సంఘాలు ఉన్నప్పటికీ సమాచారం ఇవ్వడం లేదన్నారు. 15 మంది సీనియర్ ఉపాధ్యాయులకి అర్హత ఉన్నప్పటికీ జనగణ విధులకు దూరమవుతున్నారన్నారు. ఎంఈఓ వైఖరి పై జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియూటిఎస్ అధ్యక్షులు బి.ఎల్లం, ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్, టిపియూఎస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, టిపిటిఎఫ్ అధ్యక్షులు బాలరాజు, ప్రధాన కార్యదర్శి రమేష్, యూటిఎఫ్ అధ్యక్షులు భూషణం, ప్రధాన కార్యదర్శి రఫిక్, ఉపాధ్యాయలు వేణు గోపాల్, రాజు, కిషన్, సాయి కుమార్, గోపాల్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## మిస్సింగ్ మొబైల్స్‌ను బాధితులకు అందజేత

**ప్రజాపక్షం/ములుగు :** ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఆన్‌లైన్(సిఈఐఆర్ పోర్టల్) ద్వారా ఫిర్యాదు చేయగా ఫిర్యాదు నమోదు చేసుకున్న స్టేషన్ సిబ్బంది, వాటిని తిరిగి బాధితులకు అప్పగించడంలో భాగంగా ములుగు ఐటి కోర్ టీం సహాయంతో ఈ నెలలో మిస్సైయిన 25 మొబైల్ ఫోన్లను విజయవంతంగా గుర్తించి, వాటిని గురువారం బాధితులకు ఎస్‌పి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఐటి కోర్ టీమ్‌ను అభినందించారు. వారి కృషి వలన తక్కువ సమయంలోనే మొబైల్ ఫోన్లు తిరిగి సాధించగలిగామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందికి మిస్సింగ్ మొబైల్స్ రికవరీపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, ఫి ర్యాదులపై క్రమం తప్పకుండా ఫాలోఅప్ చే యాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలు తమ వ్యక్తిగత వస్తువుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలని, మొ బైల్ ఫోన్లు కోల్పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫి ర్యాదు నమోదు చేసుకొని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/మెదక్ :** వైశ్యుల కుల దైవం వాసవి మాత జయంతినీ రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి మెదక్ పట్టణంలో గురువారం మెదక్ పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవి అనుబంధ సంస్థలు, కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మ్యాడం బాలకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు వెంకటరమణ, శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్, వైశ్య సంఘం బాధ్యులు లక్ష్మీ పతి, శ్రీనివాస్, పురం వేంకట నారాయణ, నాగేష్, సుమన్, తొడుపునూరి శ్రవణ్, మహిళా బాధ్యులు వనజ, కొత్త పద్మ, షిర్నా శారద, కొత్త సుమన, పాల్గొన్నారు.

## మహిళలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### టిజిఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/కొండాపూర్ :** రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రదాన లక్ష్యమని టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు .కొండాపూర్ మండల పరిధిలోని తేర్పోల్ ,ఎదురు గూడెం, గ్రామాల్లో ఎన్ఆర్ఈజి ఎస్ నిదులతో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనాలకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళలే కుటుంబానికి సమాజానికి బలమైన పునాది వారి ఆర్థిక ,సామాజిక అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాద్యం కాదు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సాదికారతను లక్ష్యంగా పెట్టుకుని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రతి మహిళను ఆత్మ విశ్వాసంతో ముందుకు నడిపించిఆమెను ఆర్థికంగా బలంగా నిలబెట్టడం మా ప్రభుత్వ ధ్యేయం మాటల్లో కాదు పనుల్లోనే మహిళల అభివృద్ధిని చూపిస్తున్నమని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సర్పంచ్ సతీష్, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశం గౌడ్, నర్సింలు ప్రభుదాస్, అశోక్, గోపాలతో పాటు పంచాయతీ సభ్యులు ఐకెపిఇ వీఓలు అధికారులు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు

### భగీరథ స్కిమ్ ద్వారా ఇంటింకీ నల్లా
### జిల్లా అదనపు కలెక్టర్ ఆర్ .పాండు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** గురువారం ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భగీరథ జయంతి ఉత్సవాల్లో అదనపు కలెక్టర్ ఆర్.పాండు జ్యోతి ప్రజ్వలన చేసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ ప్రయత్నంగా భగీరథ స్కీమ్ ద్వారా ఇంటింటికీ నల్లా ఇచ్చే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. ఉన్నతమైన లక్ష్యంతో చేపట్టి న పనిని భగీరథ ప్రయత్నముగా చెప్పుకుంటామన్నారు. ఈయన స్ఫూర్తిని భావితరాలకు తీసుకోపోవాలని కోరారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అదికారి జగదీష్ మాట్లాడుతూ భగీరథ జయంతి అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. ఎంత కష్టమైనా లెక్క చేయకుండా అనుకున్నది సాంధించేవారిని భగీరథునితో పోలుస్తారని, గంగను దివి నుండి భువికి రప్పించాడని తెలిపారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి భగీరథ మహర్షి లాగ జీవితంలో కార్యసాధకులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ అధికారి అఖిలేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సగర ఉప్పర జిల్లా అధ్యక్షుడు, మురళి కృష్ణ ,జిల్లా కోశాధికారి తుక్కన్న, మహిళా అధ్యక్షురాలు గాయత్రి, కోశాధికారి నాగలక్ష్మి , యువజన సంఘం ఉపాధ్యక్షుడు చింత శంకర్, ప్రధాన కార్యదర్శి, ఉప్పరి శంకర్‌సాగర్, కోశాధికారి శ్రీకాంత్, జిల్లా వివిధ గ్రామాలనుంచి వచ్చిన 20 మంది ఉప్పర సంఘం సభ్యులు, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అమర్‌జ్యోతి ,అమర్‌నాథ్, కార్యాలయ పరిపాలనాధికారి విద్యాసాగర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కమ్యూనిటీ భవనంకు నిధుల కోసం ఎంపి ఈటలకు వినతి



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** వైద్యవృత్తిని ప్రపంచానికి పరిచయం చేసిన వృత్తిగా, నేటి డాక్టర్లకు తీసిపోకుండ ప్రత్యక్ష సేవలు చేసే కులవృత్తి దారులు నాయి బ్రాహ్మణులు అని, ఆరోగ్య విషయంలో రాజీలేని సేవలు చేసే నాయిబ్రాహ్మణులను కేంద్ర ప్రభుత్వం తరుపున చేయూత అందించాలని, తమకు సంక్షేమ పథకాలు కల్పించాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు నాయిబ్రాహ్మణ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొండూరి సతీష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలో ఓ కార్యక్రమానికి విచేసిన ఎంపీకి ధూల్మిట్ట నాయిబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంకు నిధులను అందించాలని కోరుతు ఈటలకు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్బంగా నాయిబ్రాహ్మణ సేవా సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, ధూల్మిట్ట మండల గౌరవ అధ్యక్షులు కొండూరి సతీష్‌కుమార్, మాట్లాడుతూ, రోజురోజుకు ఆర్థికంగా చితికిపోతున్న తమ కుటుంబాలలో నిర్వహించుకునే వివాహాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలను నిర్వహిచుకునేందకు ధూల్మిట్ట నాయిబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ భవనంకు నిధులను అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రోజురోజుకు మైనారిటీలోకి పడిపోతున్న తమ నాయిబ్రాహ్మణ కులస్తులను ఆదుకోవడానికి, ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధూల్మిట్ట నాయి బ్రాహ్మణ అధ్యక్షులు కొండూరి అరవింద్, కోశాధికారి రవి, సీనియర్ నాయకులు కొండూరి సత్తయ్య, పందిల్ల శ్రీనివాస్, స్వామి, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించలేరా ?

**ప్రజాపక్షం/హుస్నాబాద్ః** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అయి ఉండి నీ శాఖకు సంబంధించిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించలేవా అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీష్ బాబు ప్రశ్నించారు.గురువారం హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ముందు గత రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న సమ్మెకు వారు మద్దతుగా సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా సతీష్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీలో కూడా ఒకటేనని ఆయన అన్నారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఐలేని మల్లిఖార్జున్ రెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మెన్ సుద్దాల చంద్రయ్య,పట్టణ అధ్యక్షులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ తిరుపతి రెడ్డి,పార్టీ అధ్యక్షులు వెంకట్రామ్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు ,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన గంగారపు బుజ్జమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి కొంతకాలంగా నిజాంపేటలో గుడిసె వేసుకోని నివసిస్తున్నారు.ఆమె చిన్న కుమారుడు అశోక్(21) బుధవారం ఉదయం ప్లాస్టిక్ బాటిళ్లు ఏరడానికి వెళ్లి, వాటిని అమ్ముకొని మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. అనంతరం తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లో ఉంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినప్పటికి అతను కనబడలేదు. గురువారం మధ్యాహ్నం సమయంలో నిజాంపేట శివారులోని గడిం చెరువులో ఒక మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా చెరువు ఒడ్డుపై అతని బట్టలు గుర్తించారు. స్నానం చేయడానికి చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించినట్లు కుటుంబికులు తెలిపారు. సంఘటన స్థలనికి నిజాంపేట ఎస్ఐ రాజేష్ చేరుకుని పరిశీలించారు. మృతని తల్లి గంగారపు బుజ్జమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

### ఎంపిఒ గంగాధర్



**ప్రజాపక్షం/అల్లాదుర్గంః** ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు మెరుగైన సౌకర్యాలు లభిస్తున్నాయని ఎంపీ ఓ గంగాధర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కిషోర్‌లు అన్నారు. అల్లాదుర్గం ఎస్సీ బాలుర వసతి గృహంలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహంలో అందిస్తున్న సౌకర్యాల గురిం చి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులకు విద్యా, ఆరోగ్య, క్రమశిక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను మరి కొంత మందికి వివరించి ఇప్పుడున్న విద్యార్థుల సంఖ్యను పెం చేందుకు అందరూ సహకరించాలని వారు కోరారు. ఈ కార్య క్రమంలో కార్యదర్శి ప్రభాకర్, హాస్టల్ సిబ్బంది నీలి శివయ్య, తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** వేసవి సెలవుల్లో పిల్లలతో కలిసి తల్లిదండ్రులు ఆడడం పాడడం చేయాలి అని, పిల్లలకు కథలు చెప్పడం వారు చెప్పిన కథలు వినడం చేయాలని, ఆదే విధంగా అంకెలతో ఆటలు పనులు చేయించాలని రాంపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మారెడ్డి సూచించారు. వంట వార్పు నేర్పించాలని, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, టీవీలలో వార్తలు వినడం అలవాటు చేయాలని, విద్యార్థులను ఇంటి వద్ద జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఇందులో ఏపీసీ చైర్మన్ యాదమ్మ, పంచాయతీ సెక్రెటరీ చంద్రహాస్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి, సయ్యద్ తల్లిదండ్రులు రాజు గౌడ్, బాలరాజు, వెంకటస్వామి గౌడ్, దుర్గ రాజు, బాల లక్ష్మి , నవ్య, రాజేశ్వరి, శిరీష, లత, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సంక్షోభంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి: మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల

**ప్రజాపక్షం/పాపన్నపేటః** ర్టాషంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి విమర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోగా, వారిని ఆందోళనల బాట పట్టేలా ప్రభుత్వం ప్రవర్తించడం శోచనీయమని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరిని గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఆర్టీసీ కార్మికుల ప్రతినిధులతో చర్చలు జరపాలని కోరారు. కార్మికుల కష్టాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని, ఆర్టీసీని కాపాడుకుంటూనే, కార్మికుల సంక్షేమాన్ని చూడాలని విజ్ఞప్తిచేశారు.